సాక్షి
నిర్మల్
శుక్రవారం । 9 । ఆగస్టు । 2024

గరిష్టం/కనిష్టం
32.2/25.3
వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. జిల్లాలో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.



న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ



కలెక్టర్‌కు పూల మొక్క అందజేస్తున్న ఈడీ

నిర్మల్‌చైన్‌గేట్: ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఈడీగా ఎన్రాల శంకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. జిల్లా ఈడీగా పనిచేసిన మనోహర్‌రావు ఆదిలాబాద్‌కు బదిలీ కాగా, అక్కడ పనిచేస్తున్న శంకర్ నిర్మల్‌కు వచ్చారు.

12న స్పాట్ అడ్మిషన్లు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 12న డిప్లమా ఇన్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రమేశ్ తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు కళాశాలలో దరఖాస్తు ఫారం, సంబంధిత సర్టిఫికెట్లు జతపర్చి ఈ నెల 11 లోపు సమర్పించాలన్నారు. వివరాలకు 9908864830 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

హరిత వనాలతో ఆహ్లాదం



అభివృద్ధి పనుల డిస్‌ప్లే తిలకిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: హరిత వనాలు ఆహ్లాదం పంచుతాయని, గండిరామన్న హరితవనం దిన దినాభివృద్ధితో నిర్మల్ పట్టణ ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఆహ్లాదం పంచుతోందని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గండిరామన్న హరితవనంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పార్కులో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులను, కల్పించిన వసతులపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. అటవీశాఖ, కేంద్ర నిధులతో పార్కు దినదినాభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. పార్కులో వాకింగ్ ట్రాక్ సహా వ్యాయామ పరికరాలు, పిల్లల ఆటవస్తువులు, అటవీ జంతువుల బొమ్మలు, ఇలా అనేకం ఏర్పాటు చేసి పార్కును అందంగా తీర్చిదిద్దారని అన్నారు. ప్రజలు స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగస్వాములై మొక్కలు నాటాలని సూచించారు. నిర్మల్ నియోజకవర్గాన్ని కేంద్ర నిధులతో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీసీఎఫ్ శరవణన్, శిక్షణ ఐఎఫ్‌ఎస్ కేపీవీఎస్ ప్రసాద్‌రెడ్డి, ఎఫ్‌డీవో నాగినీభాను, ఎఫ్‌ఆర్‌వో రామకృష్ణ, డీఆర్వోలు సంతోష్, నసీర్‌ఖాన్, పార్కు ఎఫ్‌ఎస్‌వో వేణుగోపాల్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



ట్రాన్స్‌ఫార్మర్ షెడ్‌ను పరిశీలిస్తున్న వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: క్షేత్రస్థాయిలో ట్రాన్స్ ఫార్మర్స్ సమస్యలను పరిష్కరించి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి జిల్లా విద్యుత్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ట్రాన్స్ ఫార్మర్ స్టోర్‌తోపాటు ట్రాన్స్ ఫార్మర్ రిపేర్ షెడ్‌ను గురువారం పరిశీలించారు. ట్రాన్స్ ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు వీలైనంత త్వరగా అందించాలన్నారు. ఆయన వెంట విద్యుత్ శాఖ ఎస్ఈ బి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు ఉన్నారు.

అడుసు తొక్కకుండా.. అడుగు వేయలేం!

- నిర్మల్ బల్దియాలో ప్రతీ గల్లీలో బురదే
- రోడ్లు మొత్తం గుంతలు, బురద
- రహదారులపైనే డ్రైనేజీ నీళ్లు
- కనీసం నడవడానికీ ఇబ్బందే
- మురికి కూపాలుగా ఓపెన్ ప్లాట్లు

బాధ్యులెవరూ..!?



'మేమూ మనుషులమే. మేముండేది నిర్మల్ మున్సిపాలిటీలోనే. మేం ఇళ్లు, భూములు, ఉద్యోగాలు, ఉపాధులు అడుగుతలేము. పిల్లలు, ఆరోగ్యంగా ఉండేలా చూడమని కోరుతున్నం. మరి మాకెందుకు మంచి రోడ్లు వేయడం లేదు..? ఎందుకు డ్రైనేజీలు నిర్మిస్తలేదు? మా కాలనీ మొత్తం రోడ్లన్నీ కనీసం నడువరాకుండా ఉన్నాయి. డ్రైనేజీలు సరిగ్గా లేక మురికినీరు ఇళ్ల ముందు నిండుతోంది. ఇలాంటి వాతావరణంలో నిత్యం దోమలతో సావాసం చేస్తున్నాం. మాకు మా పిల్లలకు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు వస్తున్నాయి. మాకేదైనా అయితే.. ఎవరు బాధ్యులు. మున్సిపాలిటీకి ఇది కనిపిస్త లేదా..!? మా గోసను పట్టించుకునే పాలకులు, అధికారులు లేరా...!?' అంటూ సోమవారం జిల్లాకేంద్రంలోని శాంతినగర్ కాలనీవాసులు నిర్మల్ మున్సిపల్ ముందు ఇలా నిరసన వ్యక్తంచేశారు. తమ కాలనీకి వచ్చి చూసే సమయం కూడా మున్సిపల్ అధికారులకు లేదని, తామే అక్కడి సమస్యలను ఫొటోలు తీసుకువచ్చి ప్రదర్శించారు.

కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ పక్కనే..



ఈ ఫొటో.. సాక్షాత్తు కలెక్టర్ క్యాంప్ కార్యాలయం పక్కనే, ఆర్డీఓ ఆఫీస్ ఎదుట, మున్సిపల్‌కు అతిసమీపంలోనే ఉన్న డ్రైనేజీది. ప్రధాన రహదారితో పాటు గాంధీకూరగాయల మార్కెట్‌కు నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగించే మార్గం. ఇలాంటి చోట ఇలా.. మురికినీరు రోజంతా రోడ్డుపైనే పారుతోంది. పక్కన ప్రధాన రహదారిపై నిలుస్తోంది. అసలే వర్షాకాలం.. ఆపై డెంగీ, మలేరియాల సీజన్. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఇక్కడ శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

నిర్మల్: నిర్మల్ పట్టణంలో ఏ గల్లీ చూసినా బురద రోడ్లు, నీటి గుంతలే దర్శనమిస్తున్నాయి. పాదచారులు బురద అంటకుండా ఇల్లకు చేరలేని పరిస్థితి నెలకొంది. ప్రతీ ఏడాది వర్షాకాలం ఎలా ఉంటుందో, ఈ సీజన్‌లో పట్టణంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో, ఏయే ప్రాంతాల్లో సమస్యలు ఎదుర్కొంటారో.. ఇలా అన్ని విషయాలూ అధికారులకు తెలుసు. అయినా పాలకులు, అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడం జనాగ్రహానికి కారణమవుతోంది. ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదని పట్టణ ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలోని చాలా కాలనీల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈక్రమంలోనే కాలనీవాసులంతా కలిసి బల్దియాపై దండెత్తుతున్నారు. ఇటీవల పట్టణంలోని శాంతినగర్ కాలనీవాసులు ఇలాగే మున్సిపల్ ఎదుట నిరసన వ్యక్తంచేశారు. తాజాగా గురువారం శ్రీనగర్ కాలనీవాసులు మున్సిపాలిటీకి వచ్చి వినతిపత్రం ఇచ్చారు. బంగల్‌పేట్ డబుల్‌బెడ్రూం కాలనీవాసులూ రెడీ అవుతున్నారు.

నడవడానికీ ఇబ్బందే..

జిల్లా కేంద్రమన్నట్లే కానీ.. ఇక్కడ కొన్ని కాలనీల్లో రోడ్లు వర్షాకాలం నడవడానికి కూడా పనికిరావు. ఇలాంటి రోడ్లపై నిత్యం ప్రయాణిస్తుంటే బైకులు, ఆటోలు, కార్లు సైతం దెబ్బతింటున్నాయి. ఒక్క శాంతినగర్, ఇందిరమ్మ కాలనీ, సోఫీనగర్ కాలనీలే కాదు.. శ్రీనగర్, విద్యానగర్, ఆదర్శనగర్, ఇంద్రానగర్, శాస్త్రీనగర్, ప్రియదర్శినినగర్ వంటి కొత్త ఏరియాలతోపాటు చింతకుంటవాడ, నగరేశ్వర్‌వాడ, బాగులవాడ, కస్బా, ద్యాగవాడ, బాలాజీవాడ, కుర్రన్నపేట, సోమవార్‌పేట్, గాంధీ చౌక్, బేస్తవార్‌పేట్, బుధవార్‌పేట్, బంగల్‌పేట్, మహాలక్ష్మీవాడ, డబుల్‌బెడ్రూంఇళ్లల్లో తదితర ఏరియాల్లోనూ రోడ్లు దారుణంగా ఉన్నాయి. ఇటీవల కొన్నిచోట్ల పైనుంచి మట్టి, కంకర డస్ట్‌ను పోసినా.. చాలాచోట్ల గుంతలు అలాగే ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు.



శాంతినగర్‌లో బైక్‌పై రావడానికి ఇబ్బందే..



శాంతినగర్‌లో రోడ్డుపై నిలిచిన నీటిగుంత





బంగల్‌పేట్ డబుల్ బెడ్రూం ఇళ్లకు వెళ్లే రోడ్డు ఇలా..

ఇలాగైతే దోమలు పెరగవా..

ఓ దిక్కు డెంగీ, మలేరియాలు విజృంభించకుండా ప్రభుత్వం స్వచ్ఛదనం పేరుతో కార్యక్రమాలు చేపడుతోంది. మరోవైపు జిల్లాకేంద్రంలో డ్రైనేజీల్లోని మురికినీరు రోడ్డెక్కుతోంది. కొత్తకాలనీల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎక్కడా డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురికినీరంతా రోడ్లపైనే పారుతోంది. లేదంటే సమీపంలో ఖాళీగా ఉన్న ప్లాట్లలోకి చేరి మురికి కూపాన్ని తలపిస్తోంది. ఇలాంటి వాటితోనే దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితులు ఉండటంతోనే ప్రియదర్శినినగర్‌లో డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.

వర్షాకాలం పరేషానే..



తమ కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు లేవని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. వర్షాకాలం వస్తే పరేషానే. దోమలతో పిల్లలు, పెద్దలు రోగాల బారిన పడాల్సి వస్తోంది.
– రాము, ఇందిరమ్మకాలనీ, శాంతినగర్

ఎవరికి చెప్పినా..



శాంతినగర్ ఇందిరమ్మ కాలనీలో ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. ఏళ్లుగా ఇక్కడ రోడ్లు, కాలువలకు లేక అవస్థలు పడుతున్నాం. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు.
– నర్సింగ్‌రావు, ఇందిరమ్మ కాలనీ, శాంతినగర్

ఇబ్బందులు పడుతున్నం..



శ్రీనగర్ కాలనీలో ఒక్కరోడ్డు కూడా సరిగ్గా లేదు. మొత్తం బురదగుంటలతో నడవడానికి కూడా చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బైకులపై పిల్లలతో వెళ్లాలంటే.. ఎక్కడ జారుతుందోనని భయపడాల్సి వస్తోంది. – రాకేశ్‌సింగ్, శ్రీనగర్ కాలనీ

పట్టించుకునేవారు లేరు..



డబుల్‌బెడ్రూం ఇళ్లల్లో ఉంటున్నవారి కష్టాలను ఎవరూ పట్టించుకుంటలేరు. ఇళ్లల్లోకి వచ్చినప్పటి నుంచీ ఇక్కడ సమస్యలు ఎదుర్కొంటూనే ఉ న్నాం. ఎవరికి చెప్పినా కూడా సమస్యలు తీరడం లేదు.
– సుజాత, బంగల్‌పేట్ డబుల్‌బెడ్రూం కాలనీ

స్వచ్ఛ రాఖీ..

స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కడెం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో డీఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛ రాఖీ కార్యక్రమం నిర్వహించారు. మహిళా అధికారులు, సిబ్బందితో కలిసి రాఖీ ఆకృతిలో ఆకులు అలంకరించారు. తర్వాత చేతులపై స్వచ్ఛదనం–పచ్చదనం కడెం, నిర్మల్ జిల్లా అని మెహందీ వేసుకున్నారు. అనంతరం డీఆర్డీవో మాట్లాడుతూ రాఖీ పండుగ సందర్భంగా రాఖీ కట్టిన సోదరికి మొక్కను గిఫ్ట్‌గా ఇవ్వాలని సూచించారు. భవిష్యత్ తరాల మనుగడ కోసం మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. అనంతరం సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ, ఏపీవో జయదేవ్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. – కడెం



ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

- డ్రగ్స్ జోలికి వెళ్లొద్దు
- ఏఎస్పీ అవినాశ్‌కుమార్



పోస్టర్లు విడుదల చేస్తున్న వీసీ, పోలీస్ అధికారులు

బాసర: నిర్మల్ పోలీసు.. మీ పోలీస్‌లో భాగంగా బాసరలోని ఆర్జీయూకేటీలో ఎస్పీ జానకీషర్మిల ఆదేశాల మేరకు ర్యాగింగ్, యాంటీ నార్కోటిక్‌పై సదస్సు నిర్వహించారు. భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ హాజరై మాట్లాడారు. కళాశాల ప్రాంగణంలో ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తోటి విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. విద్యార్థులపై కేసు నమోదైతే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవన్నారు. విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్ అనేది తేడా లేకుండా స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. సరదాల కోసం మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దన్నారు. తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. డ్రగ్స్ వినియోగంతో జీవి తం అంధకారమవుతుందని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించారు. యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ, వర్సిటీ ప్రొఫెసర్లు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నిత్యం నిర్వహించాలి

- మున్సిపల్ జేడీ శ్రీపాద రామేశ్వర్



వార్డుల్లో పర్యటిస్తున్న ప్రత్యేక అధికారి రామేశ్వర్

నిర్మల్ టౌన్/భైంసాటౌన్: వ్యాధులు ప్రబలకుండా ప్రతీ వార్డులో పారిశుధ్య పనులు నిత్యం నిర్వహించాలని మున్సిపల్ జేడీ (స్వచ్ఛదనం పచ్చదనం ప్రత్యేక అధికారి) శ్రీపాద రామేశ్వర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప లు వార్డుల్లో గురువారం పర్యటించారు. పరిసరా లను పరిశీలించారు. వ్యాధుల నియంత్రణకు పరిసరాల పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలను కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. భైంసా పట్టణంలోనూ స్వచ్ఛదనం, పచ్చదనం పనులు పరిశీలించారు. అనంతరం మున్సిపల్ సమావేశ మందిరంలో వార్డు అధికారులు, మెప్మా ఆర్పీలతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు పారిశుధ్యం, మొక్కల పెంపకం, సీజనల్ వ్యాధులపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్లు రాజు, రాజేశ్‌కుమార్, మెప్మా పీడీ సుభాష్, మేనేసర్ గోరీష్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది ఉన్నారు.

పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి

భైంసారూరల్/లోకేశ్వరం/కుభీర్: పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అన్నారు. మండలంలోని లింగా, కోతల్‌గాం గ్రామాలను, లోకేశ్వరం మండలం సాథ్‌గాం, కుభీర్ మండలం వీర్‌గాం గ్రామాలను గురువారం సందర్శించారు. నర్సరీ, ప్రకృతివనం, వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్డు, పారిశుధ్య పనులను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు లక్ష్యం మేరకు మొక్కలునాటి సంరక్షించాలని సూచించారు. ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకులను మూడు రోజులకోసారి శుభ్రం చేయలన్నారు. పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్లకు తరలించాలన్నారు. మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీల్లోని రికార్డులను తనిఖీచేశారు. ఆయన వెంట ఎంపీడీవోలు సుధాకర్‌రెడ్డి, సోలమాన్‌రాజ్, మోహన్‌సింగ్, ఎంపీవోలు మోజంహుస్సేన్, హరిలాల్, సాథ్‌గాం గ్రామ ప్రత్యేకాధికారి వెంకట రమేశ్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు ఉన్నారు.

ఆర్జీయూకేటీలో వన మహోత్సవం



మొక్క నాటుతున్న వీసీ వెంకటరమణ

బాసర: బాసరలోని ఆర్జీయూకేటీలో వనమహోత్సవం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ప్రతీ విద్యార్థి, ఉద్యోగి ఒక మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో రావి, వెదురు, యోగిస, మర్రి, నేరే డు, ఎర్రమద్ది, ఉసిరి, చింత, వేప మొక్కలు నాటినట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాకేశ్‌రెడ్డి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామారావు, డాక్టర్ విజయ్‌కుమార్, క్యాంపస్ బ్యూటిఫికేషన్ కన్వీనర్ గజ్జల శ్రీనివాస్, సీఐ రాకేశ్, హరికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆది'వాసి మారలె'..!

- అడవులే ఆసరాగా..జీవనం
- ఇప్పటికీ అభివృద్ధికి దూరం
- కనీస సౌకర్యాలకు నోచుకోని గూడేలు
- నేడు ఆదివాసీ దినోత్సవం



దీపాల వెలుగులోనే మిద్దెచింత వాసులు(ఫైల్)

నిర్మల్: 'నా ఆదివాసులారా.. అడివితల్లినే నమ్ముకున్న బిడ్డలారా.. మనందరికీ పెద్దకష్టమే అస్తున్నది. భారతమాతను బానిసగా జేసి, దేశాన్ని దోసుకుంటున్న ఆంగ్లేయులు కండ్లు మన అడివితల్లిపైనా పడ్డయ్. ఊళ్లు, రాజ్యాలు సాలవన్నట్లు తెల్లదొరలు మన అడివి మీదికొస్తున్నరు. మనం ఇట్లనే సూసుకుంటే మన గూడేలు, అడవులనూ నాశనం చేస్తరు. అడివితల్లి. ఆదివాసీబిడ్డల జోలికి వస్తే ఎట్లుంటదో ఆ ఆంగ్లేయులకు సూపించాలె..' అంటూ మీసం తిప్పుతూ విల్లంబులను చే త్తో ఎత్తి గర్జించిన అడవిబిడ్డ, ఆదివాసీ వీరుడు రాంజీగోండు. తనతో సహా వెయ్యిమంది అమరవీరుల ను దొంగదెబ్బ తీసి ఆంగ్లేయులు నిర్మల్ శివారులో ని భారీ ఊడల మర్రికి ఉరేశారు. అంతటి ఆదివాసీ వీరుల త్యాగం ఇప్పటికీ వెలుగులోకి రాలేదు. అంతేకాదు.. ఇప్పుడు కూడా జిల్లాలో వెలుగులు చూడని ఆదివాసీ గూడేలూ ఉన్నాయి. ఏళ్లు కాదు.. తరాలే గడిచిపోతున్నా.. అభివృద్ధికి అందనంత దూరంలో, అడవుల్లోనే వాళ్ల జీవితాలు గడిచిపోతున్నాయి.

అదే'దారి'లో.. 'చీకటి' బతుకులు..

దేశం అంతరిక్ష ప్రయోగాల దాకా అభివృద్ధిలో దూసుకుపోయినా.. అడవి బిడ్డలకు మాత్రం కనీసం రోడ్డు సౌకర్యాలు అందించడం లేదు. దశాబ్దాలుగా అడవిబిడ్డలు తమ గూడేలకు నడుచుకుంటూ పోవాల్సిందే. 'అమ్మా.. మనూరికి రోడ్డు ఎందుకు లేదే..? మన ఊళ్లె కరెంటు కూడ ఎందుకు లేదమ్మ..? మనమెప్పటికీ ఇట్లనే నడుసుకుంట పోవాల్నా..! చీకట్లనే ఉండాల్నా..?' అని అటవీ మార్గంలో, రాళ్లరప్పల దారిలో నడుస్తున్నప్పుడు తమ పిల్లలు అడుగుతుంటే ఆదివాసీ తల్లిదండ్రులకు ఏం సమాధానం చెప్పాలో కూడా తెలియని పరిస్థితి. ఇంకెన్నాళ్లకు తమ కష్టాలు తీరుతాయో కూడా ఊహించలేని దుస్థితి. జిల్లాలో ఒక్క చాకిరేవుదో.. రాగిదుబ్బదో.. మిద్దెచింతదో.. ఇస్లాంపూర్‌దో.. అల్లంపల్లిదో.. పిప్పల్‌ధరిదో కాదు.. చాలా అటవీ గ్రామాల్లో ఈ కష్టాలు ఇప్పటికీ ఉన్నాయి. ఇవ్వాళ్ల కాకున్నా.. రేపైనా తమ జీవితాలు బాగుంటాయన్న ఆశతో ఆదివాసులు తరాలుగా నడుస్తున్నా.. వారి 'దారి'మాత్రం మారడం లేదు. వారికి అభివృద్ధి 'వెలుగులు' అందడం లేదు.

ఇప్పటికీ కాలినడకనే..

- కడెం మండలంలోని మిద్దెచింత, ఇస్లాంపూర్, గంగాపూర్, రాణిగూడ, కొర్రతండా, అల్లంపెల్లి, బాబానాయక్ తండా పంచాయతీల పరిధిలో దాదాపు పదిగ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు.
- పెంబి మండలంలోని చాకిరేవు, పెద్దరాగిదుబ్బ, చిన్నరాగిదుబ్బ, సోముగూడ, వస్‌పెల్లి, దొంధరి, గుమ్మెనఎంగ్లాపూర్ గ్రామాలకు ఇప్పటికీ దారి లేదు. 2021లో కడెం వాగుపై కొట్టుకుపోయిన పస్పుల వంతెనను అలాగే వదిలేశారు. దీంతో అప్పటి నుంచి అంకెన, రాయదారి, పస్పుల, కోరకంటి, దెయ్యాలమద్ది, హరిచంద్ తాండ గ్రామాలకు రవాణా సౌకర్యాలు దెబ్బతిన్నాయి. ధోత్తివాగు దాటడానికి రాంనగర్, యాపల్‌గూడ ప్రజలు తరాలుగా తిప్పలు పడుతూనే ఉన్నారు.
- ఖానాపూర్ మండలం బావాపూర్(ఆర్) పంచాయతీ పరిధిలోని పంగిడిగూడెం, కొలాంగూడ పరిధిలోని కుసుంపూర్, దేవునిగూడెం, అడవి సారంగపూర్ పరిధిలోని జిల్లెడుకుంట, కొత్తగూడెం గ్రామాలకు సరైన రోడ్డుసౌకర్యం లేదు. జిల్లెడుకుంట, కొత్తగూడెం ఊళ్లకు వెళ్లేదారిలో అటవీ ప్రాంతం నుంచి వచ్చే వాగులపై ఏటా తాత్కాలిక చర్యల చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు.
- సారంగపూర్ మండలం ఇప్పచెల్మ, పెండల్‌ధరి తదితర గ్రామాలకు పూర్తిస్థాయిలో రోడ్డుసౌకర్యాలు లేవు. వర్షాకాలంలో మధ్యలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి.
- మామడ మండలం తోటిగూడ, పులిమడుగు, రాంపూర్ గ్రామాలకు రోడ్లు లేవు. తమ సమస్యలు పరిష్కరించే వరకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని భీష్మించుకు కూర్చున్నా.. ఉన్నతాధికారులు అప్పటికప్పుడు నచ్చజెప్పారే తప్పా.. ఇప్పటికీ ఆదివాసుల కష్టాలు పట్టించుకోవడం లేదు.

కదంతొక్కిన బీడీ కార్మికులు

- కలెక్టరేట్ ఎదుట ధర్నా
- హామీలు నెరవేర్చాలని డిమాండ్



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వివిధ కేటగిరీలకు చెందిన కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని సీపీఐ(ఎంఎల్) మాస్లైన్ ఆధ్వర్యంలో జిల్లాలోని బీడీ కార్మికులు కదం తొక్కారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హా మీలు నెరవేర్చాలని నిర్మల్ కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కట్ల రాజన్న మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల అమలుతోపాటు ఎలాంటి ఆంక్షలు లేకుండా ఆగస్టు 15 లోపు రూ.2 లక్షల రు ణమాఫీ చేయాలన్నారు. బీడీ కార్మికులకు, ప్యాకర్స్ కు, నెలసరి ఉద్యోగులకు చేయూత పథకం ద్వారా రూ.4 వేల పెన్షన్ అందించాలన్నారు. పోడు సాగుదారులకు పట్టాలు, సాగు హక్కులను, అర్హులైన వారికి తెల్ల రేషన్ కార్డు, ఇంటి స్థలం లేని వారికి ఇంటి స్థలం, గృహ నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. ధరణి సమస్యలను పరిష్కరించి కౌలు రైతుల గుర్తింపునకు చర్యలు చేపట్టాలన్నారు. భవన నిర్మాణ, అసంఘటిత, కాంట్రాక్టు కార్మికులకు సెలవులతో కూడిన కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రామ్‌లక్ష్మణ్, జిల్లా అధ్యక్షు డు బక్కన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కె.లక్ష్మి, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వాగ్మారే మహేందర్, జక్కుల రాజన్న, మడావి అంకుశ్‌రావ్, కుంచపు ఎల్లయ్య , రాజారాం, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిరుత దాడిలో ఆవు మృతి

బోథ్: మండలంలోని చింతల్‌బోరి శివారు ప్రాంతంలో చిరుత దాడిలో ఆవు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బుధవారం పార్డి బిలో రైతు తొడసం సీతారాంకు చెందిన ఆవు చింతలబోరి గ్రామ శివారులోని అడవిలో మేత మేస్తుండగా చిరుతపులి దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భయాందోళన చెందిన పశువుల కాపరి అక్కడినుంచి పారిపోయి రైతుకు సమాచారం అందించాడు. వృద్ధులు, పశువులు, మేకలు, గొర్రెల కాపరులు దట్టమైన అడవుల్లోకి వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

విద్యార్థులు తినే ఆహారంలో పురుగులు



భోజనంలో వచ్చిన పురుగులు

బోథ్: మండల కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థులు తినే ఆహారంలో పురుగుల వచ్చిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు గురువారం మధ్యాహ్నం భోజనం చేయడానికి హాస్టల్‌కు వెళ్లారు. ఈ క్రమంలో భోజనం చేస్తున్నప్పుడు ఆహారంలో పురుగులు రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఒకరి అదృశ్యం



సతీష్ (ఫైల్)

కుంటాల: మండలంలోని లింబా(కే)గ్రామానికి చెందిన గుంజ సతీష్ అదృశ్యమైనట్లు ఎస్సై వి.రజినీకాంత్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలంలోని సుభాష్ నగర్‌కు చెందిన సతీష్ బతుకు దెరువు కోసం కుంటాల మండలంలోని లింబా(కే) గ్రామానికి భార్యతో కలిసివచ్చి వడ్డెర వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 8న భార్యతో గొడవపడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం అతని భార్య ఉమ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

- గిరిజన గూడేల్లో కానరాని మౌలిక వసతులు
- తాగునీటికి తప్పని తండ్లాట
- విద్య, వైద్యపరంగానూ వెనుకబాటు
- హక్కుల కోసం ఆగని అడవిబిడ్డల ఆక్రందన
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

వాగులోని నీటిని తీసుకెళ్తున్న నార్నూర్ మండలంలోని బొజ్జగూడ గ్రామ మహిళలు



అడవి బిడ్డలం.. అభివృద్ధి కనం!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వివరాలు
ఐటీడీఏ పరిధిలోని మండలాలు : 77
ఆదివాసీ గిరిజన కుటుంబాలు: 67,648
ఆదివాసీ గిరిజన జనాభా: 4,84,790

కైలాస్‌నగర్: అడవిలో పుట్టి... అడవిలో పెరిగి.. అడవితల్లి ఒడిలోనే సాగుతున్న వైవిధ్యమైన జీవన ప్రయాణం. రోజురోజుకు సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతున్నా తమ ఆచార వ్యవహారాలను పదిలపర్చుకుంటూ కొండకొనల నడుమ ప్రకృతి తో మమేకమై జీవనం సాగించే అమాయకత్వం ఆదివాసీల సొంతం. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 76 పూర్తికావచ్చినా ఆదివాసీల జిల్లాగా ముద్రపడిన ఆదిలాబాద్ జిల్లాలోని అడవిబిడ్డల జీవన ప్రమాణాల్లో మాత్రం మార్పురావడం లేదు. ఇప్పటికీ తాగునీటికి తీవ్ర తండ్లాట నెలకొనగా విద్య, వైద్యపరంగా వెనుకబాటు తప్పడం లేదు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా తమ హక్కులు, అస్తిత్వం కోసం అడవిబిడ్డలు చేస్తున్న ఆక్రందన మాత్రం ఆగడం లేదు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం 1994లో ఐక్యరాజ్యసమితి ఆగస్టు 9ని 'అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవం'గా ప్రకటించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీల ఆచార వ్యవహారాలు, జీవన శైలిపై 'సాక్షి' అందిస్తున్న కథనం...

ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇబ్బంది

ఆదివాసీలకు విద్యపరంగా వెనుకబాటు తప్పడం లేదు. గిరిజనులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వాలు ప్రతిపాదనలు చేస్తున్నప్పటికీ ఆచరణలో కార్యరూపం దాల్చడం లేదు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ఏళ్లుగా ఉపాధ్యాయుల నియామకాలు లేకపోవడంతో టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో సీఆర్టీలతోనే బోధన సాగిస్తున్నారు. కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ చదువుకునే పరిస్థితులు అందుబాటులోకి రాలేదు. టీటీసీ, ఏఎన్‌ఎం శిక్షణ కేంద్రాలను ఏజెన్సీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ప్రతిపాదనలు రూపొందించినా అమలుకు నోచుకోవడంలేదు. ఐటీడీఏ పరిధిలోని డీఎడ్ కళాశాలను మూసివేశారు. ఉట్నూర్ కేంద్రంగా మంజూరైన గిరిజన యూనివర్సిటీని ఇతర జిల్లాకు తరలించడంతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయమే జరిగింది. ఉన్నత విద్యావకాశాలు లేక ఆదివాసీలు నష్టపోవాల్సి వస్తోంది.

వర్షాకాలం... కష్టాలమయం

ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గూడేల్లో నివసించే ఆదివాసీలకు వర్షాకాలం కష్టకాలమనే చెప్పుకోవాలి. 170కు పైగా గూడేలకు ఇప్పటికీ విద్య, వైద్యం, తాగునీరు, రోడ్డు రవాణా వ్యవస్థ వంటి సౌకర్యాలు లేవు. ముఖ్యంగా వర్షాకాలంలో వాగులు, వంకలు ఉప్పొంగి రోజుల తరబడి బాహ్య ప్రపంచానికి దూరం కావాల్సిన దుస్థితి నెలకొంది. వాగులు దాటుతూ ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి. సరైన రోడ్లు లేకపోవడం, ఉన్న రోడ్లు బురదమయంగా మారడంతో అత్యవసర పరిస్థితుల్లో గూడేలకు 108, 104, 102 వాహనాలు కూడా రాలేని దుస్థితి. ప్రాణాల మీదకు వస్తే ఎడ్లబండ్లు, మంచాలపై రోగులను వేసుకుని వాగులను దాటించి తీసుకెళ్లాల్సి వస్తోంది. వర్షాకాలంలో గర్భిణులకు వైద్యం అందని ద్రాక్షగానే మిగులుతోంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఉమ్మడి జిల్లాలో వరద కష్టాలకు వాగులు, వంకలు దాటలేక వైద్యం అందక 45 మంది గర్భిణులు,



రోడ్డును బాగుచేసుకుంటున్న భీంపూర్ మండలంలోని గోవింద్‌పూర్ గ్రామస్తులు

32 మంది నవజాత శిశువులు, 17 మంది బాలింతలు చనిపోయారు. రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ సేవలు ఇంకా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. పలు ఆదివాసీ గ్రామాల్లోనూ ఇప్పటికీ కరెంట్ వసతి లేకపోవడంతో అంధకారంలోనే కాలం వెల్లదీస్తున్నారు.

వేసవిలో చెలిమే నీరే దిక్కు

వేసవికాలం వచ్చిందంటే ఆదివాసీలు తాగునీటికి తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. ఇంటింటికీ శుద్ధ జలం అందిస్తున్నామని ప్రభుత్వం చెప్పుకుంటున్నా ఇప్పటికీ అనేక గ్రామాలకు తాగునీరు అందడం లేదు. ఫలితంగా కిలో మీటర్ల దూరంలో ఉన్న చేదబావులు, వాగుల్లోని చెలిమెల నుంచే ఎడ్లబండిపై డ్రమ్ములు కట్టి, నెత్తిన బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లోని గిరిజన గూడేల్లో ఈ దుస్థితి మరింత ఎక్కువగా ఉంది.

ఆగని అడవిబిడ్డల ఆక్రందన

జల్..జంగల్ ..జమీన్ నినాదంతో సాగిన భూపోరాటం స్ఫూర్తిగా ఆదివాసీలు ఏళ్లుగా తమ హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారు. 1/70, పెసా చట్టాల ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు భూములపై సర్వహక్కులు ఉంటాయి. ఆర్ఓఎఫ్ఆర్-2006 చట్టం ప్రకారం భూములను సాగు చేస్తున్న ఆదివాసీలకు ప్రభుత్వం హక్కుపత్రాలు అందించినప్పటికీ పూర్తిస్థాయిలో అందలేదు. దీంతో తమపై అటవీ అధికారుల వేధింపులు పెరిగాయని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ ఆందోళనలు చేపడుతూనే ఉన్నారు.

సిరికొండ మండలంలోని కుంటగూడ, పాలవాగు గ్రామాలకు వెళ్లే రోడ్డు దుస్థితి



రోడ్డు సౌకర్యంలేక బాలింతను వాగు దాటిస్తున్న వైద్యసిబ్బంది



అధికారుల వేధింపులు ఆపాలి



ప్రభుత్వం ఆర్‌వోఎఫ్ఆర్ కింద గిరిజనులకు హక్కుపత్రాలు ఇచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో అందలేదు. పలు పత్రాల్లోనూ పొరపాట్లు జరగడంతో రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు పొందలేకపోతున్నారు. ముఖ్యంగా అటవీ అధికారుల వేధింపుల నుంచి గిరిజనులను కాపాడాలి. 1/70, పెసా చట్టాలను పకడ్బందీగా అమలుచేయాలి.

– గోడం గణేశ్, తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు

ఆదివాసీల అభ్యున్నతికి కృషి



ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధికోసం ఐటీడీఏ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ఆంగ్లమాధ్యమం ప్రవేశపెట్టాం. దాన్ని పకడ్బందీగా అమలు చేసేలా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణనిస్తున్నాం. బైక్ అంబులెన్స్‌లను త్వరలో ప్రారంభిస్తాం. హైమన్‌డార్ఫ్ కోచింగ్ సెంటర్‌లో నిరుద్యోగులకు ప్రత్యేక శిక్షణనిస్తున్నాం.

– ఖుష్బూ గుప్తా, ఐటీడీఏ పీవో

ప్రణాళికతోనే పట్టపగలు చోరీ

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ గంగారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

సారంగపూర్: మండలంలోని బీరవెల్లికి చెందిన ఒన్నె సుధాకర్ ఇంట్లో ప్రణాళికతోనే పట్టపగలు చోరీ జరిగిందని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బీరవెల్లి గ్రామానికి చెందిన ఒన్నె సుధాకర్ ఈ నెల 2న గొర్రెలు మేపేందుకు వెళ్లగా అతని భార్య లక్ష్మి వ్యవసాయ పనుల నిమిత్తం పంటపొలానికి వెళ్లింది. సమీపంలో నివాసం ఉంటున్న ఇప్ప పరమేశ్వర్ పక్కా ప్రణాళికతో ఇంటి తాళాన్ని రాయితో పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. బీరువా తెరిచి అందులో దాచి ఉంచిన 7తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్షా యాభైవేల నగదు అపహరించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డీఎస్పీ గంగారెడ్డి ఆధ్వర్యంలో రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై శ్రీకాంత్ ఆధారాలు సేకరించారు. గురువారం బీరవెల్లి గ్రామానికి పరమేశ్వర్ వచ్చినట్లు సెల్‌ఫోన్ ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చోరీకి పాల్పడినట్లు అంగీకరించాడు. అతని వద్ద నుంచి వెండి, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

పంటపొలంలో పడి వ్యక్తి మృతి



అశోక్ (ఫైల్)



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై సుమలత

లక్ష్మణచాంద: ప్రమాదవశాత్తు పంటపొలంలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని రాచాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై సుమలత తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన చిట్యాల అశోక్ (52) తన చిన్న కుమారుడికి మధ్యాహ్నం భోజనం ఇచ్చేందుకు నర్సాపూర్ గ్రామ శివారులోని పంట పొలం వద్దకు వెళ్లి తిరిగి పొలం గట్టుపై నుండి నడుచుకుంటూ వస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పొలంలో పడిపోవడంతో ఊపిరాడక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. మృతుని భార్య భీమవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కాపర్ వైర్లు దొంగిలించిన వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: పంట పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులో నుంచి కాపర్ వైర్లు, అల్యూమినియం, ఆయిల్‌ను దొంగిలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బోథ్ గ్రామానికి చెందిన ఇప్ప బలరాం, పరమేశ్వర్, ఆదిలాబాద్‌కు చెందిన మిర్యాల శ్రీకాంత్ కొన్నినెలల క్రితం బతుకుదెరువు కోసం సారంగాపూర్ మండలంలోని బీరవెల్లికి వచ్చి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జల్సాలకు అలవాటుపడి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. దీంతో పంటపొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌వైరు, ఆయిల్ దొంగిలించేవారు. ఈ నెల 6న నిర్మల్ పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను విప్పి అందులోంచి కాపర్‌వైరు, ఆయిల్ దొంగిలించారు. ఇప్ప బలరాం ఈ నెల 8న వాటిని విక్రయించేందుకు సంచిలో పెట్టుకుని స్థానిక గాంధీ చౌక్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా బుధవార్ పేట్ చౌరస్తా వద్ద పోలీసులను చూసి భయపడి పరిగెత్తాడు. దీంతో పోలీసులు అతన్ని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అతని వద్ద నుండి 21 కిలోల 500 గ్రాముల రాగి తీగ, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మిర్యాల శ్రీకాంత్ పరారీలో ఉండగా, ఇప్ప పరమేశ్వర్ మరో కేసులో అరెస్ట్ అయ్యాడు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై అశోక్‌ను డీఎస్పీ అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

భైంసారూరల్: మండలంలోని సిరాల గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్సై మారుతి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం సాయంత్రం గ్రామ సమీపంలో దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు ఆయనపేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.11 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జ్వరంతో యువతి మృతి



జ్యోతి (ఫైల్)

ఇంద్రవెల్లి: జ్వరంతో యువతి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని తుమ్మగూడలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపి న వివరాల మేరకు గ్రామానికి చెందిన కోట్నాక్ భీంరావ్, కళాబాయి దంపతుల కుమార్తె జ్యోతి (20) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా రక్త పరీక్షలు నిర్వహించి సాధారణ జ్వరంతో పాటు టైఫాయిడ్ లక్షణాలు ఉన్నాయని వైద్యులు నిర్ధారించారు. రోజూ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా గురువారం జ్వరతీవ్రత పెరిగింది. 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. యువతి మృతితో తుమ్మగూడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

బజార్‌హత్నూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో నానక్‌సింగ్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రకు చెందిన సురేష్ శిరజోర్ చౌహన్ (29) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బలన్‌పూర్ గ్రామ సమీపంలో కుక్కలను తప్పించబోయి కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని బోథ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం

బాసర: నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం గుండారం గ్రామానికి చెందిన బొమ్మ రావుల్లా గంగు అనే ఓ వృద్ధురాలు గురువారం బాసర వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి గోదావరి నదిలో దూకేందుకు ప్రయత్నించింది. గమనించిన స్థానికులు వృద్ధురాలిని కాపాడారు. నిజామాబాద్ జిల్లా జాన్కంపేట్ వెళ్తానని చెప్పడంతో తలాకొంత డబ్బులు జమచేసి వృద్ధురాలిని బస్సులో పంపించారు.

పంచమికి పిల్లలను పంపించండి..!



గేటు బయట నిరీక్షిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



గేటు వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు

- భైంసా ఆశ్రమ బాలికల పాఠశాల వద్ద తల్లిదండ్రుల నిరీక్షణ

భైంసాటౌన్: పట్టణంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు గురువారం ఉదయం విద్యార్థుల తల్లిదండ్రులు భారీగా చేరుకున్నారు. ఎందుకని ఆరా తీస్తే తమ పిల్లలను నాగుల పంచమికి ఇంటికి తీసుకెళ్లేందుకు వచ్చామని చెప్పారు. అయితే పాఠశాల ఉపాధ్యాయులు పిల్లలను ఇంటికి పంపించడం లేదని వాపోయారు. దాదాపు రెండు, మూడు గంటల పాటు పాఠశాల గేటు బయటే వేచి ఉన్నారు. ఎంతకూ ఉపాధ్యాయులు పిల్లలను పంపించకపోవడంతో అక్కడే నిరీక్షించారు. అనంతరం ఉపాధ్యాయులు సర్దిచెప్పడంతో నిరాశగా వెనుదిరిగారు. ఈ విషయమై హెచ్‌ఎం స్వర్ణమంజులను 'సాక్షి' వివరణ కోరగా శుక్రవారం పాఠశాలలో ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని ఆదేశాలున్నాయని, ఈ నేపథ్యంలో విద్యార్థులను ఇంటికి పంపించాలని తమకు ఆదేశాలు లేవన్నారు.

11 దాటినా.. పాఠశాలలు తెరవలే!





ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో జిల్లాలోని కొన్ని మారుమూల ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలల (టీడబ్ల్యూపీఎస్) ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదు. గురువారం పదకొండు దాటినా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మొలాల గుట్ట, సాలాయి గూడ టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలు తెరుచుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. విద్యార్థులు ఆ సమయంలో ఆడుకుంటూ కనిపించారు. దీంతో గిరిజన విద్యార్థులకు చదువు అందక నష్టపోతున్నారు. - సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

66 మందికి ఒకే ఉపాధ్యాయుడు



నిర్మల్ జిల్లా కేంద్రం శాంతినగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదోతరగతి వరకు 66 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కానీ వారందరికీ పాఠాలు బోధిస్తున్నది మాత్రం ఒకే ఒక్క ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌గౌడ్. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా ఇటీవల బదిలీల్లో భాగంగా ఒకరికి పదోన్నతి వచ్చి వెళ్లిపోయారు. దీంతో ఉన్న ఒక్క ఉపాధ్యాయుడే ఐదు తరగతుల విద్యార్థులకు అన్నిసబ్జెక్టులు బోధిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా దరిచేరుతుందో విద్యాశాఖ అధికారులకే తెలియాలి మరి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్